కథానిక

# ప్రొద్దుతిరుగుడు పువ్వు

కాళూరి హనుమంతరావు

బస్సు దాదర్‌లో ఆగింది. అక్కడ బస్సుకోసం నిరీక్షిస్తున్న పొడుగాటి క్యూ మెల్లిగా కదల సాగింది. మూర్తి పరధ్యానంగా, తన కాళ్ళే తనను ముందుకి తీసుకుపోతున్నట్లు ముందుకినడుస్తున్నాడు.

బొంబాయిలో సూర్యోదయం అయి చాలా సేపయింది. వర్షంలో తడిసిన పెద పెద్ద మేడల మీదా, సిమెంటు రోడ్ల మీదా సూర్యుడు వింతగా ప్రసరిస్తున్నాడు. రెండు రోజులుగా ఎండా వానా ఒకదాన్నొకటి వెంటాడుతున్నట్లుగా ఉండీ ఉడిగీ వర్షంపడుతూ ఆవేళ తెల్లవారు ఝామునే బాగా తుంపరపడింది. వర్షంలో తడితడిగా ఉన్న వాతావరణంలో సూర్యకాంతి చాలా ఉల్లాసంగా సౌందర్యంగా వ్యాపించింది. కాని స్విచ్చివెయ్యగానే మిషన్‌లో భాగాలన్నీ వేటిపని అవి చేసుకుపోతున్నట్లు తెల్లవారగానే బొంబాయి నగరంలో ఎవరి పనుల తొందరమీద వాళ్లు పోతున్న అశేష జనావళిలో ఎవరికీ ఈ సూర్యోదయంలోని రామణీయాన్నీ, ఉల్లాసాన్నీ కాస్త సేపు ఆగి తిలకించే వ్యవధిలేక పోతున్నది. అసలాసూర్యోదయంలోని సౌందర్యం ఆ నగరవాతావరణంలో అసహజంగానూ, చాలా విలక్షణంగానూ కనిపిస్తున్నది. రోడ్ల మీద ట్రాఫిక్ నిండాఉంది. బస్సులు, ట్రాములు, కార్లు, ఎలక్ట్రిక్ రైళ్ళు. అన్నిటికన్నా యంత్రాల్లాగ జీవిస్తున్న ప్రజలగుంపులు—ఏదో మిస్ అవుతున్నట్లు, ఎవరో వెంటాడుతున్నట్లు తొందరగా పోతున్నారు.

"ఖాలీ నై" బిగ్గరగా బొంగురు గొంతుకతో అరచేడు కండక్టరు, మూర్తి బస్సులో అడుగు పెట్టబోతూ ఉండగా. సరిగ్గా తన దగ్గరకు వచ్చేసరికి బస్సు నిండిపోయింది. మళ్ళీ యింకా బస్సు వచ్చేవరకూ నిలుచోవలసిందే.

ఆ టైము గడవడానికి మూర్తి సిగరెట్ వెలిగించేడు. కాస్త పక్కకి తిరిగి తన వెనకాల చాలా దూరం వరకూ వ్యాపించిన క్యూని చూసేడు. సుమారు చివరలో నీరజ కనిపించింది చేత్తో కిట్ బేగ్, ప్లాస్టిక్ రైన్ కోట్ పట్టుకొని. చేతితో విష్ చేస్తూ సంజ్ఞ చేద్దామనుకొన్నాడు. కాని నీరజ తన వైపు చూడ్డంలేదు.

నీరజ! మూర్తి పనిచేస్తున్న ఆఫీసులో నీరజ క్రొత్తగా చేరిన టైపిస్టు. నీరజని చూడ్డంతో అతని మెదడులో ఏవో ఊహాలు ఉత్సాహంగా రాసాగేయి. తర్వాత రావలసిన బస్సువచ్చి, అందులో తను కూర్చొని, దిగవలసినచోట దిగి ఆఫీసులోకి నడిచి చేరుకొనేవరకు ఇంకా నీరజే అతని ఆలోచనలలో చెరపివేయరాకుండా మెదులుతూవచ్చింది. ఆసలు నీరజ ఆఫీసులో చేరిన దగ్గరనించీ మూర్తి నీరజ కోసమేగాని ఆఫీసులో పనిచెయ్యడానికి వస్తున్నట్లు లేదు.

మూర్తి ఆఫీసు చేరుకొనేసరికే తక్కిన గుమాస్తాలు చాలామంది వచ్చేసి ఎవరిపనులలో వాళ్ళు నిమగ్నులై ఉన్నారు. కాస్తసేపు ఆ ఆఫీసంతటినీ ఏదో తెలుసుకోబోతున్నట్లు కలయజూసేడు. తర్వాత తన సీటు దగ్గరకి నిర్లిప్తంగా సమీపించి తన జీవితాన్ని కొన్ని రోజులుగానూ, పనిచేసే గంటలగానూ విభజించి రోజూ కొంత భాగం చొప్పున తినేస్తున్న ఆ కుర్చీలో బరువుగా కూర్చొన్నాడు. అలా కూర్చొని తనకీ ఆఫీసుకీ ఏమీ సంబంధం లేకపోయినట్లు ఏ పనీ చెయ్యకుండా ఏవో మ్యూజింగ్స్‌లో మునిగిపోయి చాలాసేపు ఊరికే కూర్చొన్నాడు. "గుడ్ మోర్నింగ్ మిస్టర్ మూర్తీ! ఇవాళ చాలా ఆలస్యంగా వచ్చేను."

మూర్తి తెప్పిరిల్లి లేచేడు. నీరజ దేవతలా వచ్చింది. వస్తూనే మొదట వాక్యం ఇంగ్లీషులోనూ తర్వాత వాక్యం హిందీలోనూ అలా అంది. నీరజ ఇంగ్లీషులోనూ హిందీలోనూ బాగా మహారాష్ట్రపు ఏసఉంది. మాటలు తేల్చి ముక్కుతో మాట్లాడుతుంది. ఒట్టిమాటలే ఇంపుగా వినాలనిపిస్తూ ఉంటాయి.

కాని మూర్తి అన్నది వినిపించుకోనంత తొందరగా తన సీట్లో కూర్చుని, కాగితాలు స్టేండుకి తగిలించి టైప్ మిషన్ మూత తీసి, మిషన్ ఎడ్జెస్టు చేసుకొని గబగబా టైప్ చెయ్యడం మొదలెట్టింది నీరజ. నీరజ చాలా ఓపికగా, తొందరగా పని చేస్తుంది. ఆడవాళ్ళకి పని చెయ్యడంలో ఓపికా శ్రద్ధా ఎక్కువంటారు. నీరజకి మరీను.

మూర్తి తలవంచుకొని కాస్తసేపు ఫైల్సు తీసి అటూఇటూ తిప్పేడు. మళ్ళా టేబుల్ మీద పడేసేడు. తల పైకెత్తి అటూఇటూ చూసేడు. ఆఫీసు పనితో నిండిపోయి ఉంది. ఎదురుగా నీరజ గబగబా టైప్ చేస్తోంది. టైప్ చేస్తున్న నీరజను పరీక్షగా కొన్ని నిముషాలు అనిమేషంగా చూసేడు. ఆఫీసు పనికోసం టైప్‌మిషన్ మీదికి వంగిన ఆమె శరీరం, మిషన్ మీద ఎంతో వేగంగా పరుగెత్తిపోతున్న ఆమె చేతివ్రేళ్లు ఇవన్నీ దేవత లాంటి ఆమె శరీర సౌందర్యానికి చాలా విరుద్ధంగా ఉన్నట్లనిపించింది. అతడి చూపులు అలా ఆశగా తిరిగితిరిగి ఆమె వక్షోజాల ఎత్తుకి అతుక్కుపోయాయి. టైప్ చేస్తూచేస్తూ యథాలాపంగా మూర్తికేసి చూసిన నీరజ అది గమనించి పమిటె సరిగా సర్దుకొంది. దానితో తన ఊహా చిత్రానికి తెర పడ్డట్టయి మూర్తి ఆఫీసు పనిలోకి మేల్కొన్నాడు.

అలా మధ్యాహ్నం పన్నెండున్నరవరకూ పని చేశాక తర్వాత కాంటీన్‌లోకి వెళ్ళి భోజనం చేసేడు. తర్వాత ఆఫీసువేళ అయేవరకూ పింగ్ పాంగ్ ఆడేడు. ఒంటిగంటన్నరకి ఆఫీసులోకి మళ్లా వస్తూ ఉండగానే మేనేజరుగారు రమ్మంటున్నారని కబురు వచ్చింది. అది ఏడాది చివరకావటం వల్ల ఆ ఏడాది ఎకౌంట్లన్నీ ఫైనలైజ్ చెయ్యవలసి ఉంది. ఆ పని తొందరలో మధ్యాహ్నం అంతా మేనేజర్‌తోనే గడపవలసి వచ్చింది. అంత పని తొందరలో కూడా అలా అతని స్మృతిపథంలో నీరజ మెదులుతూనే ఉంది.

సాయంకాలం ఆఫీసు ముగిసి మూర్తి బస్సు స్టాప్ దగ్గరకు వచ్చేసరికి మేఘాలు ఆకాశంలో క్రమక్రమంగా దట్టంగా చేరుకొంటున్నాయి. సాయంకాలం ఉండవలసినకన్నా ఎక్కువ చీకటిగా ఉంది. రోజూలాగే పెద్ద క్యూ ఉంది. పెద్ద ఉద్యోగస్థులు మొదలు చిన్న ఫేక్టరీ పనివాళ్ళవరకూ రకరకాల ప్రజానీకమంతా వరసగా క్యూలో నిలబడి ఉన్న దృశ్యాన్ని ప్రతిరోజూ నిత్యనూతనంగా చూస్తూ ఆలోచిస్తూ ఉంటాడు.

మూర్తి ప్రొద్దున్న ఏడు గంటలకి ఖుర్లాలో ఉన్న తన ఇంటిదగ్గరనించి రోజూ బయలుదేరతాడు. ఖుర్లానుంచి దాదర్ రైల్లోవచ్చి, దాదర్ దగ్గర బస్సుకోసం నిలబడి ఎనిమిదిన్నరకి ఆఫీసు చేరతాడు. సాయంకాలం ఐదున్నరవరకు పని చేసి మళ్ళీ బస్సుకోసం క్యూ. కనీసం అరగంటైనా నిలబడాలి. మళ్ళీ దాదర్ వెళ్ళి రైలెక్కి ఖుర్లాలో ఇంటిని చేరుకోబోయేసరికి రాత్రి ఎనిమిదిన్నర అవుతుంది. అసలు బొంబాయి ఒక పెద్ద సన్‌డయల్. మూర్తిలాటి ఉద్యోగస్థులంతా టైమునిబట్టి అయాం చోట్లలో తప్పకుండా ఉంటూ ఉంటారు. కనీసం దినపత్రికైనా సమగ్రంగా చదువుకొందుకి తీరిక దొరకని ఈ జీవితం మూర్తిని చాలా విసుగెత్తిస్తున్నది. కాస్సేపు సరదాగా మాట్లాడుకొందామంటే ఎక్కడా స్నేహితుడు కనిపించడు. స్నేహాలన్నీ పరిచయం చెయ్యబడడంతో మొదలై "గుడ్‌బై"తో ఆఖరయి పోతాయి. మళ్ళీ కలుసుకొంటామా అనే అనుమానంతో, ఎవరైనా ఏదైనా అవసరం ఉంటే వస్తారు. తీరిపోగానే వెళ్ళిపోతారు. అంతే. అంతమంది ప్రజల గుంపుల మధ్య ముమ్మరంగా జీవిస్తున్న మూర్తి చాలా విచిత్రమైన ఒంటరితనం, మనస్సువిప్పి మాట్లాడుకోగల మరోవ్యక్తి పరిచయం లేని బాధాకరమైన ఒంటరితనంతో అవస్థపడుతున్నాడు. బొంబాయిలోనూ సహారాఎడారిలోనూ ఒకే విధంగా జీవించగలిగే అతడి భార్య రాత్రివేళ అతడి ఒంటరితనాన్ని పెంచి అసంతృప్తిని ఇంకా ఎక్కువ చేస్తుంది. ఈ పరిస్థితిలో నీరజతో పరిచయం అతడికొక ఆశారేఖలా తోచి నూతనోత్సాహాన్ని రేపింది. అంటే అతడు నీరజని పొందాలని ప్రేమించాలనీ మనసారా కోరుకోవడంకాదు. తను అంత తేలికగా కొట్టిపారేసే దుర్బలుడు కాడని మూర్తికి బాగా తెలుసు. కాని అప్సరస లాంటి ఆమె సౌందర్యం, లావణ్యం అనుకోకుండా అతణ్ణి ఆకర్షించి ముగ్ధుణ్ణి చేస్తున్నాయి. బొంబాయి జీవితంలోని దిగులు, విసుగు ఆమె ముఖంలో

ఎక్కడా కనిపించవు. రోజూ ప్రొద్దున్నే ఏ లోకంలోంచో దిగివచ్చి ఆఫీసుపని చేసేసి మళ్ళీ రాత్రి ఆ లోకంలోకి పోతున్నట్లుంటుంది. ఆమె జీవితంలో ఏదో పరిపూర్ణత ఉన్నట్లు, తను బొంబాయిలో పోగొట్టుకొన్నదేదో ఆమె సాధించినట్లు భావించి ఆమెను అదో విధమైన గౌరవ భావంతో చూస్తూ ఉంటాడు.

బస్సొకటి ఆగింది. క్యూలో ముందుగాఉన్న నీరజ బస్సు ఎక్కడం మూర్తి చూసేడు. తర్వాత ఫేక్టరీ పేకింగ్ సెక్షన్స్‌లో పనిచేసే చాలామంది స్త్రీలు, చాలా మంది ఆంగ్లో ఇండియన్ స్త్రీలు వరసగా నడుస్తున్నారు. వాళ్ళలో కొందరిని ఎక్కించుకొని బస్సు వెళిపోయింది.

ఈ పేకింగ్ సెక్షన్లలో పనిచేసే స్త్రీలని చూస్తే మూర్తికి నిర్లక్ష్యం, దిగులు, జాలి. వాళ్ళు సాధారణంగా చాలా బలహీనంగా ఉంటారు. మొహాలు ఎనీమిక్‌గా ఉంటాయి. శరీరాలు చాలా సన్నగా ఉంటాయి. వాళ్ళదైనికజీవితాలు చాలానికృష్టంగా ఉంటాయేమో అనిపిస్తుంది. అయినా వాళ్ళెంతో చెలాకీగా, హాయిగా గెంతుతూ ఉంటారు. అంటే వాళ్లు జీవితాన్ని నిలబెట్టేందుకు డబ్బును సంపాదించే ఏ పద్ధతిమీదనైనా సరే వాళ్ళ హృదయాలలో వృత్తిగౌరవాన్ని పదిలపరచుకొన్నారన్న మాట. వాళ్ళ జీవితాలు చాలా బరువనిపిస్తుంది మూర్తికి. నిజానికి తన జీవితంకన్నా వాళ్ళ జీవితాలు చాలా బరువైనవే. అయితే వాళ్ళకుండే ఆత్మవిశ్వాసంలో, ధైర్యంలో సహస్రాంశం కూడా అతడిలో లేదు.

మూర్తి దాదర్‌లో దిగి మార్కెట్‌లో ఏవో చిల్లరసామాన్లు కొనేసరికి చిన్న చినుకు ప్రారంభం అయింది. ఇంకా తన భార్యకి చీర ఒకటి కొనవలసి ఉంది. ఒక బట్టలషాపులోకి వెళ్ళేసరికి అక్కడ నీరజ మళ్ళా ఎదురైంది. తను వెళ్ళేసరికి ఏదో బ్లౌజ్ పీస్ చిరిపించి మడతపెట్టించుతోంది.

"హల్లో, గుడీవెనింగ్!" అంది.

"గుడీవినింగ్!"

నీరజ చూస్తూ ఉండగా తన భార్యకి చీర కొనడానికి అదోవిధమైన సిగ్గు కలిగింది మూర్తికి. అయినా ఏవేవో చీరలు పరీక్షించి అందులో లేత ఎరుపురంగు, నీలంరంగు కలిసిపోయి ఇంద్రధనుస్సులా మెరుస్తున్న ఒక చీర ఎంచుకొన్నాడు. తన భార్యకి కూడా ఈ రెండు రంగుల కలయిక అంటే ఇష్టం. ఆ చీర కొనేసే ప్రయత్నంలో ఉండగా వెనకనుంచి నీరజ అంది:

"మీ ఆవిడకా ఆ చీర?"

"అవును"

"ఆ లేత పసుపురంగు చీర తీసుకోండి. మీ ఆవిడకి అది తప్పకుండా నచ్చుతుంది."

ఆ పసుపురంగు చీర అట్టే బాగున్నట్లులేదు. కాని నీరజ నచ్చి కొనమంటుంటే ఏంచెయ్యాలి? ఆ చీర నీరజ కోసమే కొన్నట్లుగా కొనేసేడు.

బట్టలు తీసుకొని బయటకు వచ్చేసరికి వర్షం పడుతున్నది. కొంతవరకూ ఇద్దరూ మౌనంగా నిలబడి పోయేరు.

'మీ ఇల్లు దాదర్‌లోనే అన్నారుగా. ఎక్కడ?' ఇంతసేపూ అడగడం మరిచిపోయినట్లుగా అడిగేడు.

"ఇక్కడే. ఆ పక్కవీధిలో" అని తన ఇంటి దిక్కును సూచించింది.

ఆ ప్రక్కవీధికేసి చూసేడు. చాలా బిల్డింగులు ఉన్నాయి. ఒక్కొక్క బిల్డింగుకి అనేక టెన్‌మెంట్స్, ఒక్కొక్క టెన్‌మెంట్‌కి కొన్నిగదులు ఉంటాయి. అందులో ఒక్కగదిలో మహా అయితే రెండుగదులలో నీరజ నివసిస్తూ ఉండి ఉంటుది.

"మా యింటికి రండి. వర్షం తగ్గేవరకూ కూర్చుందురుగాని" నీరజ ఆహ్వానించింది. నీరజ వ్యక్తిగతమైన జీవితం గురించి తెలుసుకోవాలని మూర్తికి ఉంది. వెంటనే వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాడు.

ఇద్దరూ వర్షంలో తడుస్తూ గబగబా ఆ వీధిని క్రాస్‌చేసి ప్రక్కవీధిలో కొన్ని ఇళ్ళుదాటి ఒక యింట్లో ప్రవేశించేరు. లోపల అనేక ప్రజలు దగ్గరగా ఇరుకుగా జీవిస్తున్న వింతవాసన వేస్తున్నది. అనేక వంటపదార్థాలమీదనుంచి ముఖ్యంగా గుజరాతీ కూరలమీద నుంచి ప్రసరిస్తున్న అనేక వాసనల కలయిక ఊపిరితియ్యడంలోని స్వేచ్ఛని, హాయిని లేకుండా చేస్తున్నవి. అందులో ఏ ఇంటికీ ఏ గదికీ స్వేచ్ఛగా గాలి, ధారాళంగా సూర్యరశ్మి తగలవు.

నీరజ తాళం విప్పి తలుపు తీసింది. మూర్తి ఇంతవరకూ ఇంకో మనిషి ఎవరో తమతో మాట్లాడ

డానికి ఉంటారనుకొంటున్నాడు. నీరజ తనకి ఒక్క తమ్ముడుమాత్రం ఉన్నాడని, చదువుకొంటూ పార్ట్‌టైమ్ పని చేస్తున్నాడనీ చెప్పింది జ్ఞాపకం వచ్చింది. "మా తమ్ముడు ఇంకా రాలేదు. రోజూ ఎనిమిదిన్నరకి వస్తూఉంటాడు" అంది రైన్ కోట్ విప్పుతూ.

"బొంబాయిలో ఎవడూ రాత్రి ఎనిమిదిన్నర లోపున ఇంటికి రాలేడు." అనుకొన్నాడు మూర్తి వర్షంలో తడిసిన జుట్టుని, మొహాన్ని తుడుచుకొంటూ. అలా అనుకొంటూనే విచిత్రమైన ఆలోచనలలో మునిగిపోయేడు. ఇంట్లో ఎవరూ లేక పోయినా తనని ఒంటరిగా పిలిచిన నీరజ చొరవకి ఆశ్చర్యపోయేడు పరిస్థితిలోని వాస్తవికతను అతడు ఎదుర్కోలేక పోతున్నాడు. అతడి జీవిత ఇతివృత్తంలో మొత్తానికి ఈ సంఘటన చాలావిరుద్ధంగా ఉంది తనూ నీరజా ఒకే గదిలో ఉంటున్నా ఎప్పుడూ పగటి కలలకి, ఊహాలకి అలవాటు పడి పోయిన మూర్తికి తనకూ నీరజకూ కొన్ని మైళ్ళ, కొన్ని యుగాల అంతరం ఉన్నట్లు విచిత్రంగా స్ఫురించింది.

"టీ చేస్తాను. కొంచెంసేపు క్షమించాలి!" నిశ్చలమైన నీటిలో రాయి వేసినట్లు అతడి ఆలోచనలని చెదరగొట్టింది ఆ మాటలతో. నీరజ టీ చేస్తూ అప్పుడప్పుడు గదిలోకివచ్చి అతడితో ఏదో కాస్తసేపు మాట్లాడిపోతోంది. బయట వర్షం హెచ్చుతున్న హోరు వినవస్తున్నది. మూర్తి గదంతా పరిశీలనగా చూసేడు. ఒక సంసారానికి కావలసిన వస్తువులన్నీ గుట్టలుగా గదినిండా పడేసి ఉన్నాయి. ఎక్కడా మసలేందుకు ఖాళీలేదు. గది చిరాగ్గా ఉంది. ఈ ఒక్కగదే బొంబాయి జీవితాన్ని సమగ్రంగా ప్రతిఫలిస్తున్నది. రాత్రంతా ఇలాంటి గదులలో తలదాచుకొని పగలు కాగానే మంచి విలువైన దుస్తులు ధరించి పుట్టలో పాములాగ ప్రజలంతా బయటపడుతూ ఉంటారు. కాకపోతే ఆ గదిలో మురికికీ, నీరజ సౌందర్యానికీ ఆమె కట్టే చీరల తళతళలకీ ఏమైనా సంబంధం ఉందా?

"టీలో చక్కెర ఎక్కువైందేమో, క్షమించి తాగండి!' నవ్వుతూ నీరజ టీ కప్పు అందించింది. పొగచేత కళ్లు కొంచెం బరువెక్కి మొహం కలగంటున్నట్లుగా ఉంది.

ఆమె చూపులు అతణ్ణి ఆకర్షించేయి. టీ కప్పు అలాగే టేబుల్ మీద పెట్టేసి ఆమె చేతిని తన చేత్తో పట్టుకొని మృదువుగా నొక్కేడు. ఆమె పెదవులమీద సిగ్గుతో మెరుస్తున్న చిరునవ్వు అతణ్ణి మత్తెక్కించింది. తన కౌగిటిలోకి లొంగి పోతున్న ఆమె శరీరం అతణ్ణి మరీ మరీ ఉన్మత్తుడిని చేసి తొందర పెట్టింది.

* * *

టేబుల్ మీద నిర్లక్ష్యంగా పడేసిన టీ క్రమక్రమంగా వేడితగ్గి, పెచ్చుబడి, గోరువెచ్చనై చాలా సేపటికి చప్పగా చల్లారింది. మూర్తి బయటకు వెళ్ళిపోబోతూ నీరజకేసి చూసేడు. తెల్లటి మేఘంలా సున్నితంగా ఇంకా పడుకొనే ఉంది. ఆమెదగ్గరకు వెళ్ళి, వంగి "నేను వెళ్తున్నాను"అని ఆప్యాయంగా చెప్పేడు. ఆమె కళ్లు తెరచి, రెండుచేతులూ అతని మెడకి చుట్టేసి, మీదకు లాగుకొని చాలాసేపు గట్టిగా ముద్దుపెట్టుకొంది. తర్వాత మెల్లిగా వణకుతున్న కంఠంతో ఏదో ప్రణయరహస్యం చెప్పినట్లు-

"ఆ చీర-ఇందాకా మనం కొన్న చీర. చాలా బాగుంది. ఇస్తారా?" అని అడిగింది.

మూర్తి మెదడులో ఆలోచనలు ఫలానా అని నిర్వచించే పరిస్థితిలో లేవు. బుద్ధి ఒట్టి శూన్యంగా ఉంది. చీర ఆమె ఎందుకు అడిగిందో, చీర ఇవ్వడం అంటే ఏమిటో అతడికి స్ఫురించలేదు. కాని ఇవ్వడంమాత్రం చాలా అనిష్టంగానే ఇచ్చేసి ఖాళీ మెదడుతో బయటకు చక్కా వచ్చేసేడు.

వీధిలోకి వచ్చేసరికి వర్షం వెలిసి, బాగా చీకటి పడి, షాపులలో ఎలెక్ట్రిక్ లైట్లు తళతళా వెలిగి పోతున్నాయి. వికలమైపోయిన ఆలోచనల్ని క్రమక్రమంగా పోగుచేసుకొని బుద్ధిని సరిచేసుకొనే సరికి వెంటనే నీరజ గురించి తన మెదడులో రకరకాల అభిప్రాయాలు సంఘర్షించుకుంటున్నాయి.

"బొంబాయి! ఇది ఊరు కాదు. పెద్ద పిచ్చాసుపత్రి. ఇందులో అంతా పిచ్చివాళ్ళు" అనుకొన్నాడు.

ఇంతవరకు ఊహించిన తర్వాత తను నీరజ విషయంలో సబబుగా ధర్మంగా ప్రవర్తించలేదనిపించింది. నీరజగురించి అంత తేలికగా నీచంగా

భావించుకొన్నందుకు మనస్సు నొచ్చుకున్నాడు. ఆమె శరీరంలో నించుకొన్న నిండు యౌవనం, తనకి స్వర్గం రుచిచూపించిన ఆ లావణ్యానికి నిజంగా విలువ కట్టకూడదు.

ఈ ఉద్రిక్తమైన ఊహలతో గబగబా నడిచి దాదర్ స్టేషన్‌లోకి వచ్చేసరికి భూమి ఆకర్షణలోకి వచ్చిన ఉల్క భూమిమీదకు లాగివేయబడ్డట్టు మూర్తి తన వ్యక్తిగతమైన ఆలోచనల నుండి 'బొంబాయి' వాతావరణంలోకి లాగివెయ్యబడ్డాడు. ఖుర్లాకి పోయే డబుల్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ అవతల ప్లాట్‌ఫారమ్‌మీద కదిలే స్థితిలో ఉంది. తనుఇంకా వంతెనదాటాలి. మూర్తి పరుగెత్తాడు. గబగబా వంతెన దాటేడు. రైలు కదిలింది. మూర్తి ప్లాట్‌ఫారమ్‌మీద దూసుకు పోయేడు. స్పీడు హెచ్చుతూ చాలా పెట్టెలు దాటిపోయేయి. మూర్తి చప్పున ఒక పెట్టె గేట్ పట్టుకొన్నాడు. రైలుతోబాటు కొంతదూరం పరుగెత్తేడు. హఠాత్తుగా బాగా అలవాటైన నేర్పుతో ఎగిరి పెట్టెలోకి దూకేడు.

రాత్రి రైలు బాగా రష్‌గా ఉంది. మూర్తి ఒక క్షణం అటూఇటూ చూసి తలుపుకి చేరబడి నిలుచున్నాడు. ఒక సిగరెట్ తీసి ముట్టించేడు. పొగ విచ్చగా, ఘాటుగా గుండెల్లోనించి బాధని తనతోబాటు అవతలకి తీసుకుపోతున్నట్లుగా బయటకు వచ్చేస్తున్నది. అలాగ నిలబడి తన ఆ అనుభవంతో మేళవించబడిన ఆలోచనాతరంగాలను నీరజ దిక్కుకి ఒకసారి, తన ఇంటివైపు ఇంకోసారి ప్రసారంచేస్తూ ఆ రైలు ఎంత వేగంతో పోతోందో అంత వేగంతో ఖుర్లానీ, తన ఇంటినీ సమీపించ సాగేడు.

---

"రెండు పిల్లులు-ఒక కోతి"

# ఆరోగ్య కేంద్రం: రాజకీయాలు

వాసా శ్యామలరావు

ఆంధ్రరాష్ట్రములో శ్రీకాకుళంజిల్లా బహుగు ప్రాంతముగా, వెనుకబడిన ప్రాంతంగా అధికారరీత్యా అందరూ అంగీకరించారు. ఇటువంటి వెనుకబడిన ప్రాంతాలను, మిగిలినవాటి స్థాయిలోనికి తీసుకొనివచ్చుటకు డెవలప్‌మెంట్ కార్యాలయములు స్థాపించవలసిన అవశ్యకత యేర్పడింది. ప్రభుత్వం ఎంత విశాలభావంతో వీటిని స్థాపించిందో అంత అధ్వాన్నంగా యీ జిల్లాలోని కార్యాలయములు పనిచేస్తున్నాయి ప్రజలకెంత సన్నిహితంగా ఉండాలో అంత దూరంగా ఉంటున్నాయి. అదేమి దురదృష్టమో గాని రేడియో ప్రసంగాలలోనూ, యింటర్వ్యూలలోనూ, యీ డెవలప్‌మెంట్ ఉన్నతోద్యోగులు ప్రజలకు ఎంత సన్నిహితంగా ఉండి ఉచితరీతిని యథాశక్తి తమయొక్క అమూల్యమైన సలహాల నిస్తూ, పురోభివృద్ధి తమధ్యేయం అన్నట్లు నటిస్తారో, నిత్యజీవితంలో దానికి అంత వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు.

గత సంవత్సరం సెప్టెంబరు మాసంలో శ్రీకాకుళంజిల్లా కలక్టరుగారు లక్ష్మీనరసుపేట గ్రామానికి వచ్చి 'ఆరోగ్య కేంద్రం' (Health centre) స్థాపించుటకు ప్రజలవద్దనుండి విరాళము కోరారు. అదృష్టవశాత్తూ గ్రామస్థులలో సహృదయులు ఆరోగ్య కేంద్రం స్థాపించుటకు రూ 5,000 లు; విరాళమిచ్చెదమని ప్రకటించారు. అంటే ప్రభుత్వవాటా రూ 15,000 లు ప్రజల వాటా రూ 5000 లు; మొత్తము 20000 రూ॥తో ఆరోగ్యకేంద్రము స్థాపించవలసిందని ప్రజలు కోరగా డెవలప్‌మెంట్ ఆఫీసరుగారు అందుకు అంగీకరించారు. వారు కోరిన ప్రకారము రెండురోజుల తరువాత లక్ష్మీనరసుపేట గ్రామస్థులు 5000 రూ॥ కట్టేశారు. ఇది యిలాగఉండగా కలక్టరుగారు "బుడితి" అనే మరోగ్రామం వారివద్దకూడ యీ విధంగానే ఆరోగ్య కేంద్రము స్థాపిస్తామని 5000 రూ॥లు వారివద్దకూడ వసూలుచేసారు. అంటే ఒకేజిల్లాలో ఒకేబ్లాకులో రెండుప్రాంతాల